క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు

జి.సిగడాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి పేకల సుమబింధు ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, తదితర ప్రత్యేక పరీక్షలు చేసి మందులను అందించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి హేయం


సనపల నారాయణరావు

ఎచ్చెర్ల: సాక్షి కార్యాలయాలపై జరుగుతున్న దాడులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కక్షపూరిత పాలన సాగుతోందన్నారు. సంక్షేమం, శాంతిభద్రతలు గాడి తప్పాయన్నారు. సాక్షి టీవీ చర్చలో పాల్గొన్న గెస్ట్ మాటలను సాక్షికి ఆపాదించి కేసులు పెట్టడం, కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్యన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు వంటి సీనియర్ జర్నలిస్టును అరెస్ట్ చేయడం తగదన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి దారుణం

ఎచ్చెర్ల: సాక్షి కార్యాలయాలు, ఆస్తులను కూటమి నాయకులు ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఎచ్చెర్ల సాక్షి కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిని ఖండించారు. ఎచ్చెర్లలోని సాక్షి కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. పత్రికా స్వేచ్ఛను అణిచివేయాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న చర్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు మహంతి చిన్నరామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెద్ద రామినాయుడు, బట్న లక్ష్మణరావు, నక్క శ్రీనివాసరావు, మింది శ్రీనివాసరెడ్డి, రెడ్డి శ్రీను, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రణస్థలం: మండలంలోని కోష్ట, ఎస్.వి.కాలనీ, చిట్టివలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పీఓ కె.రూపలత బుధవారం తెలిపారు. కోష్ట(ఎస్సీ), ఎస్.వి.కాలనీ(బీసీ-బి), చిట్టివలస (ఎస్టీ) కేటగిరికి కేటాయించినట్లు చెప్పారు. లావేరు మండలంలోని సీహెచ్ వెంకటాపురం (బీసీ-బి), పి.యాతపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త (జనరల్) పోస్టులకు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా రణస్థలం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 24న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు రణస్థలం ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గార ప్రాజెక్టు సీడీపీవోగా శోభారాణి



గార: గార ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా జి.శోభారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటి వరకు శ్రీకాకుళం అర్బన్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇచ్ఛాపురం సీడీపీవో నాగరాణి గార ఇన్‌చార్జిగా ఇప్పటి వరకు ఉండేవారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు ఉదయం షిఫ్ట్‌లో 75 మందికి 63 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 131 మందికి 127 మంది హాజరయ్యారు.

వరి విత్తనాల పంపిణీ


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పలు కార్యక్రమాల్లో బుధవారం పాల్గొన్నారు. కొండములగాంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు ప్రారంభించారు. మోడల్ స్కూల్ మీదుగా సీతంవలస వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఏఓ విజయభాస్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యల స్వాగతం!

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- అరకొరగా తరగతి గదులు
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- కానరాని స్టూడెంట్ కిట్లు
- చాలా పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు


అసంపూర్తిగా ఉన్న జే.ఆర్.పురం హైస్కూల్ అదనపు భవనాలు


పూర్తికాని పాతర్లపల్లి స్కూల్ భవనం

రణస్థలం:

పేదలకు కార్పొరేట్ తరహా విద్యను అందించాలనే ఆకాంక్షతో గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థ రూపురేఖలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమూలంగా మార్చారు. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను చూసి జాతీయ, అంతర్జాతీయ సంస్థలే అద్భుతంగా ఉన్నాయని గుర్తించాయి. నేడు ఆ స్థాయిలో కానరాకపోగా కనీస మౌలిక వసతులు కల్పించడంలో కుటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గురువారం నుంచి పాఠశాలల పునః ప్రారంభం కానున్నాయి. చాలా పఠశాలలకు బుధవారం వరకు విద్యా కానుకలు, స్టూడెంట్ కిట్లు, యూనిఫాంలు, బూట్లు, సాక్సులు అందలేదు. బ్యాగుల కొరత ఎంత అనేది అధికారులే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. ఈ ప్రభుత్వం నాడు-నేడు పనులు చేపట్టకపోవడంతో మరుగుదొడ్లు, తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. శుద్ధమైన తాగునీరు తాగాలన్నా ఆర్వో ప్లాంట్లు చాలాచోట్ల పని చేయడం లేదు.

2024-25లో..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2024-25లో రణస్థలం మండలంలోని 108 పాఠశాలల్లో 7,650 మంది విద్యార్థులు, జి.సిగడాం మండలంలోని 63 పాఠశాలల్లో 4,900 మంది విద్యార్థులు, లావేరు మండలంలోని 85 పాఠశాలల్లో 5,216 మంది విద్యార్థులు, ఎచ్చెర్ల మండలంలోని 106 పఠశాలల్లో 8,041 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. 2025-26లో చాలా పాఠశాలల్లో విద్యార్థుల చేరిక తగ్గిపోయింది. రణస్థలం మండలంలోని 983 మంది విద్యార్థులు ఇప్పటికే డ్రాపౌట్స్‌గా ఉన్నారని, 6,667 మంది విద్యార్థులకు మాత్రమే పుస్తకాలు, కిట్లుకు సంబంధించి ఇండెంట్ పెట్టామని అధికారులు చెబుతున్నారు.

పాఠశాలలకు చేరని కిట్లు..

ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు యూనిఫాంలు, షూలు, సాక్సులు రాలేదు, బెల్టులు, బ్యాగులు, పుస్తకాలు అరకొరగానే వచ్చాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 363 పాఠశాలలు ఉండగా.. 252 పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా మరమ్మతులు, కొత్త గదుల నిర్మాణ పనులు చేపట్టారు. రూ.84.08 కోట్ల నిధులు ఖర్చు చేశారు. ప్రస్తుతం నాడు-నేడు భవనాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.


పాతర్లపల్లిలో పని చేయని ఆర్వో ప్లాంట్

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలా?



కుటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతోంది. యూనిఫాంలు పాఠశాలకు చేరలేదని అధికారులే చెబుతున్నారు. పుస్తకాలు, బ్యాగులు, షూలు సకాలంలో ఇవ్వకపోతే ఎలా. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది.

– గొర్లె శ్రీనివాసరావు, రావాడ, రణస్థలం మండలం

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి



ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత చాలాచోట్ల తరగతి గదులు నిర్మించలేదు. గత ప్రభుత్వంలో పనులు చేపట్టి పూర్తికాని భవనాల పనులను పూర్తిచేయలేదు. నాడు-నేడు భవనాలు, మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి చేయాలి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి.

– రాయపురెడ్డి భుజంగరావు, వైస్ ఎంపీపీ, రణస్థలం

కనిపించని పండుగ వాతావరణం


శ్రీకాకుళం: వమరవల్లి గురుకుల పాఠశాలలో జోరు వానలో యూనిఫామ్‌లను దించుతున్న దృశ్యం

శ్రీకాకుళం: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. అయితే అందుకుతగ్గట్టుగా మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో సమస్యల నడుమ పిల్లలు తరగతి గదుల్లోకి అడుగుపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విడదీయలేని సమస్యలను సృష్టిస్తూనే పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం కావాలని ఆదేశించింది. వాస్తవానికి ఈ నెల ఏడో తేదీ నుంచే ఉపాధ్యాయులు బడలకు వెళ్లాలని ఆదేశించి సంసిద్ధత పేరిట కార్యక్రమాన్ని రూపొందించింది. అయితే అసంపూర్తిగా పాఠ్య పుస్తకాలు రావడం, యూనిఫామ్‌లు కూడా మండల స్థాయికి సరఫరా కాకపోవడంతో దానిని నిలుపుదల చేసింది. ప్రస్తుతం మండలస్థాయికి ఒకటి, రెండు తరగతులకు సంబంధించి టిటోరియల్ డిక్షనరీ, ఏడో తరగతికి సంబంధించిం లాంగ్వేజ్, సాంఘిక, సామాన్య తరగతుల పాఠ్యపుస్తకాలు సరఫరా కాలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జూన్ 12వ తేదీన పాఠశాలల ప్రారంభించే సమయానికి విద్యార్థులికిచ్చే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు బూట్లు, యూనిఫామ్, బ్యాగ్‌ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. శ్రీకాకుళం, గార మండలస్థాయికి మంగళవారం సాయంత్రం యూనిఫామ్‌లను సరఫరా చేశారు. రోజంతా వర్షం కురవడంతో తడిచి ముద్దయ్యాయి. వాటిని ఆరబెట్టి పాఠశాల స్థాయికి పంపించాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తయ్యే సరికి ఈ నెల 15 దాటిపోయే పరిస్థితి ఉంది. 16వ తేదీ నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని కూడా ప్రభుత్వం ముందుగానే నిర్ణయించి ఆ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేసేసింది. ఉపాధ్యాయులు మూడు రోజుల పాటు శిక్షణలో ఉంటారు. ఈ లెక్కన 20వ తేదీ వరకు కిట్లు, పాఠ్య పుస్తకాలు పంపిణీ జరుగుతాయన్న నమ్మకం లేదు. అలాగే 15 రోజులుగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ప్రక్రియను విద్యాశాఖ చేపడుతూ వస్తోంది. పదోన్నతులు పొందిన వారు రిలీవ్ అయ్యి కొత్త పాఠశాలలో చేరినప్పటికీ స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించిన ప్రక్రియలో తప్పులు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పీడీలకు బదిలీలు జరిగినా వారిని రిలీవ్ చేయవద్దని మౌఖిక ఆదేశాలు రావడంతో ఆ వ్యవహారం పెండింగ్‌లో ఉంది. ఎస్‌జీటీల బదిలీల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, వాయిదాలు వేస్తూ బుధవారం నుంచి మ్యాన్యువల్ విధానం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మొత్తం 2600 మందికి కౌన్సెలింగ్ జరపాల్సి ఉండగా తొలిరోజున 550 మది ఎస్‌జీటీలకు బదిలీలు జరిపారు. దీనికి ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన ఎస్‌జీటీలందరికీ బదిలీలు జరపడానికి మరో వారం రోజులు పట్టే పరిస్థితి. ఉపాధ్యాయులందరూ ఇలా పలు రకాల సమస్యలతో ఏ పాఠశాలలో విధులు నిర్వర్తించాలన్నా ఆందోళనలో ఉన్నారు. పాఠశాలల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేయని నేపథ్యంలో ఆ సమస్యలన్నీ అలాగే ఉండిపోయాయి. ఇటువంటి తరుణంలో పాఠశాలలు పునఃప్రారంభవుతుండగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం


అవగాహన ర్యాలీలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం స్థానిక నారాయణ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పించారు. కళాశాల కరెస్పాండెంట్ రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ.. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా డయాలసిస్, తదితర కేసులు జిల్లాలో పెరగడంతో రక్తం కొరత అధికంగా ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు అన్ని వ్యవస్థలు చేయి చేయి కలిపి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలని, ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో పారామెడికల్ సిబ్బంది ముఖ్య పాత్ర పోషిస్తారని అన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యన్నారాయణ, పి.చైతన్యకుమార్, ఎస్.ఉమాశంకర్‌లు రక్తదానం ప్రాముఖ్యతను తెలియచేశారు. యువత ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. భారతప్రభుత్వ, వైద్యారోగ్యశాఖ సూచనలతో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు ఈనెల పది నుంచి 14వ తేదీ వరకు మండల, గ్రామస్థాయిలో జరుగుతోందన్నారు.

16న బాలు జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: ఘంటసాల, బాలు, జి.ఆనంద్(జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన బాలు జన్మదినోత్సవం సందర్భంగా స్వరనీరాజనం కార్యక్రమాన్ని శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, ఫిల్మ్‌డబ్బింగ్ ఆర్టిస్టు, ఏఐఆర్ బీ-గ్రేడ్ సింగర్ కె.భాస్కరరావుకు బాలసుబ్రహ్మణ్యం పురస్కారంతో సత్కరించనున్నట్టు చెప్పారు. బండారు రమణమూర్తి సంగీత సారథ్యంలో సంగీత విభావరి ఉంటుందని..అభిమానులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన సిరిమాను సందడి

- విందు భోజనాలకు వచ్చిన వారితో ట్రాఫిక్ జామ్


మాజీ మంత్రి ధర్మానను సత్కరిస్తున్న దృశ్యం


భోజనాలకు వచ్చిన వారితో నిలిచిన ట్రాఫిక్

శ్రీకాకుళం కల్చరల్:

పాతశ్రీకాకుళంలో జరిగిన సిరి మానోత్సవం సందడి బుధవారంతో ముగిసింది. చివరి రోజున విందు భోజనాల కోసం బంధువుల ఇళ్లకు వచ్చిన వారింతో పాత శ్రీకాకుళంలోని వీధులు రద్దీగా మారాయి. జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టర్ ఆఫీస్, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు రోడ్లన్నీ జనాలతో రద్దీగా మారాయి. ప్రతి ఇంటి వద్ద టెంట్లు వేసి భోజన ఏర్పాట్లు చేయడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ జిల్లా పరిషత్ తదితర చోట్ల ద్విచక్ర వాహనాలను రోడ్ల పక్కనే పెట్టేయడంతో దండివీధి, నక్కవీధి, సంతోషిమాత గుడి వరకు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. రెండు గంటల పా టు వాహనదారులకు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

గ్రామదేవతను సందర్శించిన మాజీమంత్రి ధర్మాన

పాతశ్రీకాకుళం గ్రామ దేవతల పండగ సందర్భంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మానను సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటముక్కల పాపారావు, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, ఎం.హరిబాబు, నక్క రామరాజు, ఎంఏబేగ్, బైరి మురళీమోహన్‌రావు

సిరిమానోత్సవం జయప్రదం

పాత శ్రీకాకుళంలో నెలరోజులుగా జరిగిన గ్రామ దేవత సిరిమానోత్సవం జయప్రదమైందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దండి పంకజాక్షదేవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాన్ని జయప్రదం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తు నిర్వహించిన పండుగకు అధికారులు, అనధికారులు ఎంతగానో సహకరించారన్నారు.


విందు ఆరగిస్తున్న యువకులు


యువతుల నృత్య ప్రదర్శన

నిరసన తెలిపిన మహిళకు కౌన్సిలింగ్


భర్త ఇంటి బయటే కుమారుడితో కలిసి నిద్రపోతున్న మంజుశ్రీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బలగలో మంగళవారం ఉదయం నుంచి తన భర్త దొండపాటి నవీన్‌కుమార్ ఇంటి ముందు నిరసన చేపట్టిన మంజుశ్రీని రెండో పట్టణ పోలీసులు మధ్యాహ్నం స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి కుమారునితో కలిసి ఆమె అదే ఇంటి బయట పడుకుంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటి వద్దనే ఉంది. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్నందున భర్త ఇంటికి వెళ్లకూడదని, సమస్య అవుతుందని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశామని చెప్పారు.

దత్తక్షేత్రంలో పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో గాయత్రీమాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిందత్తనాథ క్షేత్రంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు బుధవారం జరిగాయి. అర్చకులు సింహాచల శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. భక్తులచే సామూహిక లలితాసహస్రనామ పారాయణ, సౌందర్యలహరి పారాయణలు జరిగాయి. భక్తులు అన్నప్రసాద వితరణ జరిగింది. ట్రస్టు సభ్యులు, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్‌లో 87.78 శాతం ఉత్తీర్ణత


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల రెండవ సెమిస్టర్ ఫలితాలు వెలువడ్డాయి ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మిలతో కలిసి ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో సెమిస్టర్‌లో 67.70 శాతం ఫలితాలు నమోదైనటుట పేర్కొన్నారు. గ్రూపులవారీగా చూస్తే బీఏలో 78.17 శాతం, బీకాంలో 45.75, బీఎస్సీలో 74.22 శాతం ఫలితాలు సాధించినట్టు చెప్పారు. మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులను, మంచి పలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు, అకాడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐ.క్యూ.ఏ.సీ. కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

తీరిన బురద కష్టాలు


క్రషర్ వేసిన పాపారావుపేట రోడ్డు

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీలో గల పాపారావుపేట గ్రామానికి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోందని, బురద రోడ్డుతో ఇబ్బంది కలుగుతుందని ఈ నెల 2వ తేదీన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు క్రషర్ వేసి సరి చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు వేసి ప్రయాణ కష్టాలు తీరేలా చూడాలని కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్...

ప్రమాదకర ప్రహరీ తొలగింపు


ప్రమాదకరంగా ఉన్న ప్రహరీని తొలగిస్తున్న దృశ్యం

రణస్థలం: జే.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ ప్రమాదకర స్థితిలో ఉందని సాక్షిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంఈఓ త్రినాథరావు బుధవారం ప్రమాదకరంగా ఉన్న ప్రహరీని తొలగించారు. నూతన ప్రహరి నిర్మించేలా చర్యలు చేపడతున్నామని తెలిపారు.

ఉద్యాన పంటల విస్తరణకు చర్యలు

ఎచ్చెర్ల: ఉద్యానవన పంటల విస్తరణకు ప్రభుత్వం విస్తరణ పథకం ద్వారా పంట రాయితీలు ఇవ్వనుందని ఉద్యానవనశాఖ అధికారి సుదర్శిణి తెలిపారు. ఎచ్చెర్లలో పలు ఉద్యానవన పంటలను బుధవారం పరిశీలించారు. ఉద్యానవన పంటల విస్తరణ పథకం ద్వారా హెక్టార్ మామిడి సాగుకు రూ.1.25 లక్షలు ఖర్చు అవుతుందని, మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.20 వేలు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. జీడిమామిడి సాగుకు రూ.75 వేలు ఖర్చుకు.. రూ.30 వేలు రాయితీ ఇవ్వనున్నారని తెలిపారు. జీడిమామిడి అంతర పంటకు రూ.12 వేల రాయితీ ఇవ్వనున్నామన్నారు. బొప్పాయి పంటకు రూ.75 వేలు ఖర్చుకు రెండు విడతల్లో రూ.30 వేల రాయితీ ఉంటుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ హెక్టార్‌కు రూ.6,75 లక్షలు ఖర్చు అవుతుందని, రూ.2.7 లక్షల రాయితీ ఇవ్వనున్నామని తెలిపారు. చింత పంటకు హెక్టార్‌కు రూ.75 వేల ఖర్చుకు.. రాయితీ రూ.30 వేలు ఉంటుందన్నారు. కూరగాయలు హెక్టార్ సాగుకు రూ.60 వేలు ఖర్చుకు రూ.24 వేల రాయితీ, పుట్టగొడుగుల పెంపకం పథకం ద్వారా స్మాల్ స్కేల్ 200 ఎస్ఎఫ్‌టీకు రూ.2 లక్షలు ఖర్చుకు లక్ష రూపాయలు రాయితీ ఉంటుందన్నారు. జీడి, మామిడి పునరుద్ధరణకు రూ.60 వేలు ఖర్చుకు రూ.24 వేల రాయితీ, హరితగృహం ద్వారా షేడ్ నెట్ హెక్టార్‌కు రూ.70 లక్షలు ఖర్చుకు రూ. 35.50 లక్షల రాయితీ ఇస్తామన్నారు. సోలార్ కోల్డ్ రూమ్స్‌కు రూ.12.51 లక్షలు ఖర్చుకు రూ.4.38 లక్షల రాయితీ, కోల్డ్ రూమ్స్‌కు రూ.15 లక్షలు ఖర్చుకు రూ.5.25 లక్షలు రాయితీ ఇస్తామన్నారు.

ఘనంగా జగన్నాథుని జ్యేష్ఠాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్:

గుజరతీపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని జ్యేష్ఠాభిషేకాలు స్వామివారి నేత్ర బంధం దర్పణ ప్రాణ ప్రతిష్ఠ బుధవారం జరిగింది. అర్చకులు పెంట వంశీయులు పూజలు నిర్వహించారు. ఈ రోజు నుంచి స్వామి యోగ నిద్రలోని వెళ్తారు. ఆషాఢ శుద్ధ పాడ్యమినాడు స్వామివారి మేలుకొంటారని అర్చకులు తెలిపారు.

బొందిలీపురంలో

బొందిలీపురంలోని జగన్నాథస్వామి దేవాలయంలో జగన్నాథ, సుభద్ర, బలభద్రుల విగ్రహాలకు అభిషేకాలు జరిగాయి. ఏడాదిలో ఈ ఒక్కరోజే స్వామి అభిషేకాలు జరుగుతాయని, అనంతరం స్వామివారి దర్శనాలు ఉండవని, జూన్ 25న నేత్రోత్సవం అమావాస్యరోజున జరుగుతుందని, 27 నుంచి స్వామివారి రథాయాత్ర ఫలహారి మహంతి లక్ష్మీ ధర్‌దాస్ బాలాజీ ఆధ్వర్యంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా త్రిశూల స్నానాలు

- ముగిసిన ఉమారుద్రుని కల్యాణోత్సవాలు


ఉత్సవ మూర్తులకు నాగవల్లి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉన్న శైవక్షేత్రం ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా బుధవారం నాగవల్లి, త్రిశూల స్నానాలతో కల్యాణ వేడుకలు ముగిశాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుజలు చేసి మేళతాళాలతో, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లి అక్కడ శాస్త్రోక్తంగా పూజలు చేసి త్రిశూల స్నానాలు చేయించారు. వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో ఉత్సవం జరిగింది. భక్తులు కూడా స్వామివారి స్నానాల అనంతరం స్నానాలు ఆచరించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా ఆలయానికి తిసుకువచ్చారు. అనంతరం మూలవిరాట్ ఉమారుద్రకోటేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం ధ్వజాఅవరోహణం జరిగింది. ఆలయ ఈవో మునగవలస సుకన్య, సింగూరు నాగేశ్వరరావు, గన్నవరం కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, లలితా మండలి సభ్యులు పాల్గొన్నారు.